క్లుప్తంగా

పథకాలపై అవగాహన

జడ్చర్ల టౌన్: మల్లెబోయిన్‌పల్లి, చిట్టెబోయిన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన వారు ఆయా పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకట్‌ప్రసాద్, ఎంపీఓ జగదీశ్‌లు పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు బుర్ల పద్మమ్మ, భారతీ, కార్యదర్శులు స్వాతి, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పగిలిన ‘భగీరథ’ పైపులైన్

హన్వాడ: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలోకి నీటి సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైప్‌లు పగిలి నెలరోజులైందని ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక నాయకులు బొక్కిరాములు, మహేందర్ తదితరులు అన్నారు. మంగళవారం పైప్‌లైన్ పగిలి తాగునీరు కలుషితమవడాన్ని పరిశీలించారు. ఇప్పటికైనా పరిష్కరించాలని కోరారు.

జనవరి 4న ఎన్నిక

మిడ్జిల్: మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షురాలిపై ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వడంతో జిల్లా అధికారులు జనవరి 4న ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ సాయిలక్ష్మి తెలిపారు. జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు.

వేడుకలకు ఏర్పాట్లు

జడ్చర్ల టౌన్: వైకుంఠ ఏకాదశి వేడుకలు ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి దీప్తిరెడ్డి తెలియజేశారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామి దర్శనం ఉంటుందని ఆమె తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టణంలో ప్రసిద్ధిగాంచిన వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

25న దత్తజయంతి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని గంజ్ సమీపంలోని దత్తమందిరంలో ఈనెల 25న దత్త జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దత్తజాగరణ సమితి సభ్యులు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా ఉదయం 5.30గంటల నుంచి మూడు గంటల పాటు పంచామృతాభిషేకం, 9గంటల నుంచి 11 గంటల వరకు పుష్పార్చన, ఆతరువాత ఉయ్యాల సేవ, 12గంటలకు దత్తహారతి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6గంటల నుంచి సత్యసాయిభక్తబృందం భజన తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు.

‘స్టీల్’ బ్యాంకు పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మెప్మా భవనంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును మంగళవారం లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) భాస్కర్ పరిశీలించారు. కాగా వివిధ శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించే సమయంలో ఇక్కడి వంట పాత్రలు, గ్లాసులు, మగ్గులు, బేసన్లు, బోగన్లు, జగ్గులు తదితర వస్తువులను రోజువారీగా సప్లయింగ్ కంపెనీలలో వలే కిరాయికి తీసుకోవచ్చని సిబ్బంది వివరించారు. సీఓలు యాదయ్య, దేవమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ధర్మగ్రంథాల సారం ఒకటే

స్టేషన్ మహబూబ్‌నగర్: అన్ని మత ధర్మగ్రంథాల సారం ఒక్కటేనని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే క్రిస్మస్ పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని పాస్టర్లకు దుస్తులు అందజేసి ఘనంగా సత్కరించారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దైవ చింతన చేస్తూ, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతూ దైవ మార్గం చూయించే పాస్టర్లకు క్రిస్మస్ సందర్భంగా, అలాగే ఉగాది పండుగన పూజారులకు, రంజాన్ పండుగన మౌజన్లను దుస్తులు పెట్టడం తనకు చాలా ఇష్టమన్నారు. జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, పాస్టర్లు సుందర్‌పాల్, ఎన్.ఏసుపాదం, బీఎస్.పరంజ్యోతి, నాయకులు సునీల్, రాజేందర్, సుజయ్, భూషణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

స్టేషన్ మహబూబ్‌నగర్: కోయిల్‌కొండకు చెందిన ఇద్దరు ప్రయాణికులు మంగళవారం బస్సు దిగి ఎంక్వయిరీ రూం పక్కన కూర్చొని సెల్‌ఫోన్ మరిచి అక్కడి నుంచి వెళ్లిపోయారు. గమనించిన బస్‌స్టేషన్ కంట్రోలర్లు యాదమ్మ, రంగాచారి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విషయాన్ని డీఎం సుజాతకు వివరించారు. డీఎం సూచన మేరకు ప్రయాణికుడి వివరాలు తెలుసుకొని సెల్‌ఫోన్‌ను అందజేశారు. వారిని డీఎం అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: అండమాన్ నికోబార్‌లోని పోర్ట్‌బ్లెయిర్‌లో ఈ నెల 27 నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు జిల్లాకేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాల విద్యార్థి ఖాజా మోయినుద్దీన్ ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాలలో యాజమాన్యం విద్యార్థిని అభినందించింది. కరస్పాండెంట్ అరుంధతి రాయ్, ప్రిన్సిపల్ రవీందర్ పాల్గొన్నారు.
భువనేశ్వర్‌లో ఈ నెల 22న జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 జాతీయ వాలీబాల్ పోటీలకు జిల్లాకేంద్రంలోని న్యూరిషి ఉన్నత పాఠశాల విద్యార్థి ఖాజామైనొద్దీన్ ఎంపికయ్యాడు. విద్యార్థిని డైరెక్టర్లు శిరీష ప్రవీణ్, పూజిత మోహన్‌రెడ్డి, చంద్రకళ వెంకటయ్య, సుశాంత్, కృష్ణయ్య అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, పీఈటీ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించి.. వదిలేశారు

- గండేడ్ కేజీబీవీలో కొనసాగని తరగతుల నిర్వహణ
- సిబ్బంది కేటాయింపు లేని వైనం
- అందుబాటులోకి తీసుకురావాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు


గండేడ్ కేజీబీవీ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి(ఫైల్)


తాళం వేసి ఉన్న గండేడ్ కేజీబీవీ

గండేడ్: విద్యాలయాల విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తుండడం విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. వాటిని ప్రారంభించడంలో చూపిన శ్రద్ధ నిర్వహించడంలో చూపడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో లక్ష్యానికి తూట్లు పడుతున్నాయని.. . గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు. గండేడ్ కేజీబీవీ ఏర్పాటు ఇందుకు చక్కని ఉదాహరణగా నిలుస్తుందని అంటున్నారు. హంగు ఆర్భాటాలతో ప్రారంభోత్సవం చేసి వదిలేశారని చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మహమ్మదాబాద్ మండలంగా ఏర్పాటు కాక ముందు.. గండేడ్‌కు సంబంధించి కేజీబీవీని 2005లో మహమ్మదాబాద్‌లోనే ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉమ్మడి మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలోని విద్యార్థులు ఇక్కడ పదో తరగతి వరకు విద్యాభ్యాసం కొనసాగించారు. అయితే 2020 అక్టోబర్‌లో గండేడ్ నుంచి మహమ్మదాబాద్ విడివడి కొత్త మండలంగా ఆవిర్భవించింది. అయినా ఉమ్మడి మండలానికి ఇదే పాఠశాల కొనసాగుతూ వచ్చింది. మొదటగా పదో తరగతి వరకు ఉన్న దానిని ఇంటర్ వరకు పొడిగించారు. ప్రసుతం 450 మంది విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గండేడ్ మండలానికి వేరుగా కొత్త కేజీబీవీని మంజూరు చేస్తున్నట్లు గత సంవత్సరం ప్రకటించడంతో స్థానికులు సంతోషించారు. ఈమేరకు ఆరోతరగతికి సంబంధించి కొత్తగా అడ్మిషన్లు కూడా జరిగాయి. కానీ అనుమతులు లేవని అంతటితో నిలిపివేశారు. దీంతో గండేడ్ పేర జాయిన్ అయిన విద్యార్థులను తిప్పి పంపలేక మహమ్మదాబాద్‌లోనే పై అధికారులు ఆదేశించడంతో కొనసాగించారు. దీంతో రెండు మండలాల విద్యార్థులు ఒకేచోట కావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కొత్త కేజీబీవీని మంజూరు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ అది ప్రారంభోత్సవానికే పరిమితం అయ్యింది.

హడావుడి ప్రారంభం...

గండేడ్‌కు కొత్త కేజీబీవీని మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో హడావుడిగా ప్రారంభోత్సవం చేశారు. ఎన్నికల కోడ్ వస్తుందని అదే రోజు ముందు మండల పరిధిలోని పలు భూమిపూజలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి చేశారు. మహమ్మదాబాద్ కేజీబీవీ నుంచి కొంత మంది విద్యార్థులను తీసుకువచ్చి.. జిల్లా అధికారులతో గండేడ్ కేజీబీవీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆరు, ఏడు తరగతుల్లో ఉన్న పిల్లలతో కొనసాగిస్తామని చెప్పారు. కానీ అది నేటికీ అమలుకు నోచుకోలేదు. ప్రారంభించిన కేజీబీవీకి ప్రస్తుతం తాళం వేసి ఉంది. దీంతో తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పక్కా భవనం కరువు...

గండేడ్ కేజీబీవీకి పక్కా భవనం లేదు. తాత్కాలికంగా మండల కేంద్రంలోని అతిథిగృహం భవనంలో దీనిని కొసాగించాలని అధికారులు భావించారు. అందులో భాగంగానే అక్కడే ప్రారంభోత్సవం చేశారు. అయితే ఇక్కడ ఎలాంటి వసతులు లేవు. మూడు గదులు, వరండా తప్ప పూర్తిస్థాయి సౌకర్యాలేమీ లేవు. వంట గదులు, డైనింగ్ హాల్, బాత్‌రూంలు, మరుగుదొడ్లు తదితర ఏవీ కూడా లేకపోవడంతో అక్కడ పాఠశాల నిర్వహించడం కష్టమేనని తేలిపోయింది. ప్రస్తుతం గండేడ్ కేజీబీవీకి సంబంధించిన విద్యార్థులు ఆరు, ఏడు తరగతులకు కలిపి ఆరవై మందికి పైగా ఉన్నారు. వీరికి కూడా ఇప్పుడు తాత్కాలిక వసతి సరిపోవడం కష్టమేనని పలువురు చెబుతున్నారు. అంతేకాకుండా ఇప్పటి వరకు సిబ్బంది కేటాయింపూ జరగలేదని విమర్శిస్తున్నారు. దీంతో కేజీబీవీ కొనసాగుతుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం..



గండేడ్ కేజీబీవీకి ఎన్నికలకు ముందు ప్రారంభోత్సవం చేశారు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి. హడావుడి ఉండడంతో అధికారులంతా బిజీగా ఉండిపోవడంతో అప్పట్లో దానిని కొనసాగించే వీలు లేకపోయింది. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో దానిపై దృష్టి సారిస్తాం. ఉన్నతాధికారులతో సంప్రదించి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

చెరువు తూము తెరిపించండి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

హన్వాడ: చెరువు తూమును తెరిపించడం వల్ల చిన్న, సన్నకారు రైతుల పొలాలను రబీ సీజన్‌లో సాగు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని.. చర్యలు చేపట్టాలని తిరుమలగిరి గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కిష్టునాయక్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. కొందరు తమ పొలాల్లోని బోరుబావులు ఎండిపోతాయని తూమును తెరవనివ్వడం లేదని విన్నవించారు. మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, వెంకటయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

కళాశాలలకు అన్నివిధాలా సహకారం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలకు సంబంధించి నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అభినందించారు. ఈమేరకు అధ్యక్షుడిగా జహీర్‌అక్తర్, సెక్రటరీగా జయరామయ్య, కోశాధికారిగా రజినీకాంత్, గౌరవ అధ్యక్షుడిగా ఫణిప్రసాద్ ఎన్నికయ్యారు. వారిని శాలువా,జ్ఞాపికతో సన్మానించారు. ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తాను అన్ని విధాలుగా సహకరిస్తానని వీసీ తెలిపారు. రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి


ఎమ్మెల్యే పర్ణికారెడ్డితో నాయకులు

పాలమూరు: ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన వీరకురుమూర్తి బ్రహ్మోత్సవాలు


స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: పోతన్‌పల్లిలో వీరకురుమూర్తి స్వామి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారికి సమర్పించే ఉద్దాలకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ ఉద్దాల ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో విశిష్టత ఉందని ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తెలిపారు. సర్పంచ్ సత్యమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మణెమ్మ, మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అర్చకుల ఆశీర్వాదం...

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ దేవాలయం అర్చకులు ఎమ్మెల్యే యెన్నంను మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందించి సన్మానించారు. అనంతరం వేద ఆశీర్వాదం ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, నిత్యానందాచారి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే యెన్నంను వివిధ కార్యక్రమాల్లో పలువురు ఘనంగా సన్మానించారు. క్యాంప్ కార్యాలయంలో ఆయన పలువురి నుంచి వినతులు స్వీకరించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆరో నిజాం మీర్ మహబూబ్‌అలీఖాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఎ.రహీం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎంబీ చర్చ్ చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్ తదితరులు కేక్‌కట్ చేశారు. ఎం.ఎ.రహీం, ఎంబీసీ చర్చ్ వైస్ చైర్మన్ బీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, మాజీ టీజేఏసీ జిల్లా చైర్మన్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



త్యాగాలను మరువొద్దు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తి కోసం షహీద్ అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ చేసిన ప్రాణ త్యాగాలను ఎప్పటికీ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆల్‌పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మోసిన్‌ఖాన్ ఆధ్వర్యంలో వారికి నివాళులర్పించారు. అబ్దుల్ హాదీ, జాకీర్ అడ్వకేట్, రఫీక్, ఎం.ఎ.జకీ, తఖీ హుస్సేన్ అహ్మద్ సనా, షేక్ అబ్దుల్లా, హాఫిజ్ ఇద్రీస్, అన్సార్, ఈసా అమూది, ఇబ్రాహీం ఖాద్రీ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి కల్గి ఉండాలి

పాలమూరు: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని హెచ్ఎం వెంకటాజీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థి రఘునందన్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు 317జీవో ద్వారా స్థానికతను కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పరిష్కరించాలని విద్యాశాఖ నూతన కార్యదర్శి బుర్రా వెంకటేషంను కలిసి టీపీఆర్టీయూ నాయకులు విన్నవించారు. జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, తదితరులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన స్పందిస్తూ త్వరలో సమీక్ష నిర్వహించి చర్యలు చేపడతామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయం

గండేడ్: కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు చిరస్మరణీయమని మండల ముదిరాజ్ సంఘం గౌరవాధ్యక్షుడు కొమిరె లక్ష్మయ్య, అధ్యక్షుడు బోయిని గోపాల్, ప్రధాన కార్యదర్శి ర్యాకం కేశవులు పేర్కొన్నారు. మంగళవారం కృష్ణస్వామి వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఉపాధ్యక్షుడు అంజిలయ్య, సాయిలు, వెంకటయ్య, గోపాల్, రాములు, నర్సప్ప పాల్గొన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ

మిడ్జిల్: మండల కేంద్రంలో జడ్చర్ల-కల్వకుర్తి ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం బోయిన్‌పల్లి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న ట్రాక్టర్.. జడ్చర్ల నుంచి ఉర్కొండ వైపు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఘటనలో కారు డ్రైవర్ రమేష్‌తో పాటు నవీన్, మాధవి తదితరులు గాయపడ్డారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు వివరించారు.

వైద్యశిబిరం



జడ్చర్ల టౌన్: వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా మల్లెబోయిన్‌పల్లి, చిట్టెబోయిన్‌పల్లి గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సూపర్‌వైజర్ పద్మ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు శ్రీదేవి, రాజేశ్వరి ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు వివరించారు. అలాగే అబాకార్డులు నమోదు చేశారు. శిబిరంలో ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



నవాబుపేట: మరికల్‌లోని రామాలయం ఆవరణలో మంగళవారం గడ్డం పురుషోత్తం, చరణ్ స్వాముల ఆధ్వర్యంలో నారికేళ అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. గురుస్వామి వెంకటేశ్ సమక్షంలో కార్యక్రమం చేపట్టారు. నారికేళ గురుస్వామి పురుషోత్తంను ఘనంగా సన్మానించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం కొత్తగంజిలోని నీలకంఠస్వామి ఆలయం వద్ద మంగళవారం ఎం.రవి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి సామూహిక పడిపూజ నిర్వహించారు. భీమయ్య, రఘు, చెన్నయ్య, హరికృష్ణ, గణేష్, శ్రీను, భూషణ్, శుభం, రవి, రాజేష్, నిరంజన్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన బోధన అందించాలి


మట్లాడుతున్న ఎంపీడీఓ జయరాములు

పాలమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా మెరుగైన బోధన అందించాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం ఉమ్మడి తండా, కాన్గుబండ తండా ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ అవసరమన్నారు. వారికి మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు.

మంత్రి, ఎమ్మెల్యేలకు విందు


మంత్రి జూపల్లికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: దమగ్నాపురంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తన నివాసంలో మంగళవారం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, వంశీకృష్ణ, కూచుకుల్లా రాజేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి హాజరయ్యారు. వారిని మధుసూదన్‌రెడ్డి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చక్రాపూర్‌లో కనులపండువగా బోనాలు


చక్రాపూర్‌లో బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: చక్రాపూర్‌లోని ఆలయం వద్ద మంగళవారం గ్రామస్తులు వార్షికోత్సవ పూజలు చేశారు. 2021లో స్థానిక దేవాలయం వద్ద ధ్విధ్వజ, నవగ్రహ, గ్రామ దేవత విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈనేపథ్యంలోనే కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా గ్రామ దేవతకు బోనాలు సమర్పించారు. మహిళలు కొత్త కుండలతో బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. తర్వాత గ్రామ దేవత చుట్టూ ప్రదక్షిణ చేసి సమర్పించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. బోనాల ఊరేగింపు సందర్భంగా పోతురాజు విన్యాసాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, సర్పంచ్ శైలజారెడ్డి, మాజీ సర్పంచ్ పెద్ద వెంకటయ్య, లక్ష్మారెడ్డి, లక్ష్మినారాయణ, జగన్నాథ్‌రెడ్డి, బ్రహ్మయ్య, బండ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆటో కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు గుర్తుచేశారు. కానీ ఈ పథకంపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. కరోనా సమయంలో ఆటో కార్మికులను పట్టించుకోని బీఆర్ఎస్ ఇప్పుడు వారిపై కపట ప్రేమ చూపిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏటా రూ.12వేలు ఇస్తుందని.. వారికి సంక్షేమబోర్డు ఏర్పాటు చేస్తుందన్నారు. ఆందోళనకు గురికావద్దని పేర్కొన్నారు. జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు సబ్సిడీ రుణాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం తమ పాలనలో మైనార్టీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని.. ఎన్నికల ముందు మాత్రం అరకొర మంజూరు చేసి మభ్యపెట్టేందుకు ప్రయత్నించిందని కాంగ్రెస్ నాయకుడు మక్సూద్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన చెక్కులు ల్యాప్స్ అయ్యాయని ఆరోపించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేయించి.. అర్హులైన వారికి సబ్సిడీ రుణాలు అందిస్తుందన్నారు. అజహర్ అహ్మద్, సమీ పాల్గొన్నారు.

బీఎల్‌ఓల పాత్ర కీలకం

పాలమూరు: ఓటరు నమోదులో బీఎల్‌ఓల పాత్ర కీలకమైందని తహసీల్దార్ భరత్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీటీ మురళీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీలో ఆర్టీసీ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఐఎన్‌టీయూసీ అనుబంధమైన టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) రాష్ట్ర కమిటీలో జిల్లా ఆర్టీసీ నాయకులకు చోటు దక్కింది. మహబూబ్‌నగర్ డిపోలో పనిచేస్తున్న ఎం.విజయబాబును రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, అహ్మద్‌ఖాన్‌ను కార్యనిర్వాహక కార్యదర్శిగా, కార్యదర్శిగా సాయిరెడ్డిని నియమించారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలో వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. చైర్మన్ రామచంద్రయ్య, యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలను వివిధ డిపార్ట్‌మెంట్లలో సర్దుబాటు చేసి వేతనాలు ఇవ్వకపోవడమే కాకుండా ఎంప్లాయి ఐడీలు ఇవ్వలేదన్నారు. మరణించిన వీఆర్‌ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ నెల 21న కలెక్టర్ల సమావేశంలో వీఆర్‌ఏల సమస్యలపై చర్చించాలని కోరారు.

మహబూబ్‌నగర్ రూరల్: పూర్వ వీఆర్‌ఏల సర్దుబాటుపై వివిధ శాఖల్లో ప్రమోషన్ పొందిన వారికి ఎంప్లాయి ఐడీలతో పాటు వేతనాలు ఇప్పించాలని కోరుతూ వీఆర్‌ఏ జేఏసీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండీ మునీర్, సత్యనారాయణ, యాదగిరి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.